క్లుప్తంగా

యంత్రాల వినియోగంపై ఆరా



రైతుకు అందజేసిన యంత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

హిరమండలం: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 40 శాతం రాయితీతో అందజేసిన యంత్ర సేవా పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పలువురు రైతులు వ్యవసాయాధికారులకు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు.. మండలంలోని సుభలయ, మహలక్ష్మీపురం, హిరమండలం తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను కొత్తూరు వ్యవసాయశాఖ ఏడీ రాజగోపాలరావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య బుధవారం పరిశీలించారు. గతంలో రైతులకు అందజేసిన యంత్రాలు, పనిముట్లు, వాటి వినియోగం, పరికరాల లభ్యత, రైతులు ఎలా వినియోగించుకుంటున్నారు, బ్యాంకు రుణాల చెల్లింపులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వీటిని సక్రమంగా వినియోగించటంపై వ్యవసాయశాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం రామకృష్ణారావు

సరుబుజ్జిలి: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్‌ఫలితాల్లో ప్రతిభ చూపిన రొట్టవలస హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు హెచ్‌ఎం కత్తిరి రామకృష్ణారావు బుధవారం బహుమతులు అందించారు. కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అధ్యాపకులు రాజశేఖర్, ఎ.వి.రమణమూర్తి, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనులకు బియ్యం పంపిణీ

కొత్తూరు: మండలంలోని గూనభద్ర పంచాయతీ పరిధి కంఠమానుగూడ గ్రామ గిరిజనులకు ఎండీఎం వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేసినట్లు సీఎస్ డీటీ భీమారావు బుధవారం తెలిపారు. బియ్యం పంపిణీ చేయలేదంటూ ఐటీడీఏ పీఓకు ఈ నెల 15 తేదీన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు ఎంపీపీ సవర సావిత్రి, గిరిజనులు కలిసి బియ్యం పంపిణీ చేయలేదంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు అధికారులు స్పందించి కంఠమానుగూడ గిరిజనులకు ఏప్రిల్ నెలకు సంబంధించిన బియ్యాన్ని పంపిణీ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



నవధాన్యాలను ప్రదర్శిస్తున్న అధికారులు, రైతులు

పాతపట్నం: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రకృతి సిద్ధంగా, సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలని డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై, పీఎండీఎస్ కిట్లు తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా మారడమే కాకుండా ప్రజారోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

- జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

పాతపట్నం: నియోజకవర్గంలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి, అమలు చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్.వి.ఎన్.శ్రీధర్ రాజా అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రణాళికల అమలు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, తదతరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి..



హిరమండలం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.బాలకృష్ణ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందినట్లు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు తహసీల్దార్ హనుమంతురావు బుధవారం తెలిపారు. ఉద్యోగోన్నతి పొందిన బాలకృష్ణకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాగునీటి కష్టాలు



ధనుకువాడలో నువ్వు పంట

- పెరిగిన వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం
- అడుగంటిన చెరువులు, నదులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఎల్.ఎన్.పేట: ప్రతీ ఏడాది రబీ సీజన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను, అధిక లాభాలను తెచ్చిపెట్టే పంటల్లో ప్రధానమైనవి వాణిజ్య పంటలే. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలూ మహేంద్రతనయ, వంశధార నదీ తీరంలో ఉండటంతో ఇక్కడి రైతులు వాణిజ్య పంటల సాగుపట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఈ ఏడాది వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులతోపాటు ఆయా గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. వాణిజ్య పంటలకు సాగునీటి సమస్య వెంటాడుతోంది. టలను సాగుచేస్తున్నారు.'

వర్షాలు అనుకూలించక పోయినా..

వాణిజ్య పంటలకు ఈ ఏడాది వర్షాలు అనుకూలించలేదు. ప్రతీ ఏడాది డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కురిసిన వర్షాలకు పొలాన్ని దుక్కి చేసి పంటలు వేసేందుకు సిద్ధం చేసుకుంటారు. ఖరీఫ్ వరిచేను కోతలు పూర్తయిన తరువాత ఇప్పటి వరకు వర్షాలు లేవు, సాగునీటి చెరువుల నుంచి, వ్యవసాయ బోర్లు నుంచి నీటితడులు కట్టి పొలాన్ని మెత్తగా దుక్కి చేసి జనవరి, ఫిబ్రవరి నెలల్లో విత్తనాలు వేసుకున్నారు. ఆ తరువాత నుంచి నుంచి అనుకూలంగా వర్షాల్లేకపోవడంతో సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వాణిజ్య పంటల్లో ప్రధానంగా మొక్కజొన్న, వేరుసెనగ, మిరప, నువ్వు, సారికంద, హైబ్రీడ్ పెసర, చోడి (రాగి), ఉలవ పంటలను సాగుచేస్తున్నారు.

అడుగంటిన నదులు,చెరువులు

గతేడాదితో పోల్చి చూస్తే.. ఈ ఏడాది అంతగా వర్షాల్లేకపోవడం వలన ఫిబ్రవరి నెలకే చెరువులు, నదులు అడుగంటిపోయాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో చెరువుల్లో నీటి నిల్వలు అయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు తోడేయటంతో చెరువులు ఎండిపోయాయి. పొలాలకు సాగునీటి తడులు కట్టేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలను కలుపుతూ వంశధార, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం మండలాల నుంచి మహేంద్రతనయ నదులు ప్రవహిస్తున్నాయి. ఆయా నదుల్లో కూడా ఫిబ్రవరి నెలకే నీరు అడుగంటిపోయి ఎడారుల్లా దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ బోర్లుపైనే ఆధారపడి నదీతీర గ్రామాలకు చెందిన రైతులు పంటలు పండిస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో సాగు (ఎకరాల్లో) వివరాలు ఇలా..

మండలం	సాగువిస్తీర్ణం
ఎల్.ఎన్.పేట	1,250
కొత్తూరు	2,160
మెళియాపుట్టి	1,650
పాతపట్నం	2,200
హిరమండలం	1,025

వ్యవసాయ బోర్లే ఆధారం..



ఈ ఏడాది పంటలు వేసుకునే సమయం నుంచి ఇప్పటివరకు వర్షాల్లేక పోవడం వలన వాణిజ్య పంటలను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ మోటార్లపై ఆధారపడి పంటలు పండిస్తున్నాం. మొక్కజొన్న, నువ్వు, వేరుశనగ, రాగి వంటి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వాణిజ్య పంటలు వేసుకునే రైతులకు రబీ పంటలుగా గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు రాయితీపై సరఫరా చేయాలి.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట



దబ్బపాడులో సాగుచేస్తున్న చోడి పంట



లక్ష్మీనర్సుపేట వద్ద ఉలవ పంట

అనధికార కట్టడాలను నియంత్రించండి



మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్డీ పి.నాయుడు

ఆమదాలవలస: మున్సిపాలిటీలో ఉన్న మొండిబకాయిలపై అధికారులు దృష్టి పెట్టాలని, బంధుత్వాలు, చుట్టరికాలతో మొండిబకాయిలు విడిచిపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని విశాఖపట్నం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) పి.నాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బుధవారం వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ లేఅవుట్ రెగ్యులరైజేషన్ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆక్రమణల ఫీజులు వసూలు చేయాలన్నారు. పట్టణంలో అనధికార కట్టడాలను నియంత్రించాలన్నారు. ప్లాన్ అనుమతులను పొందిన వెంటనే భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. శ్రీకాకుళం డీటీసీపీఓ ఎం.కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఊయల ప్రారంభం



ఆస్పత్రిలో ఊయలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: పిల్లలను వద్దనుకుంటే తుప్పల్లో, డంపింగ్ యార్డుల్లో, మురికి కాలువల్లో, మరుగుదొడ్లలో వేయకుండా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ఊయలలో వేయాలని, పిల్లల బాధ్యత శిశు సంరక్షణ కేంద్రాలు చూసుకుంటాయని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఊయలను బుధవారం ప్రారంభించారు. స్థానిక ఐసీడీఎస్ పీఓ నాగమణి ఆధ్వర్యంలో అధికారులు ఊయల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊయల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీఓ మాట్లాడుతూ.. ఆడ పిల్లలు, అనారోగ్యం, అంగవైకల్యం, అవాంఛిత గర్భం వలన పుట్టిన పిల్లలను వద్దుకొనేవారు ఈ ఉయ్యాలలో వేయాలని, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ రమణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: విధి నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు అలసత్వం వస్తే సహించేది లేదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి బుధవారం హాజరయ్యారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చూపుతున్నారని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. వారందరినీ నిలబెట్టి.. సచివాలయాల్లో ఉద్యోగాలు అంటే కాలేజీకి వెళ్లి రావడం అనుకుంటున్నారా, ఉద్యోగం అంటే బ్యాగులు వేసుకొని గ్రామాల్లో తిరగడం కాదని, ప్రజలకు సేవలు అందించడంతో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో ఇప్పటికే మంజూరైన బోర్లును తవ్వించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా కొంతమంది అధికారులు తమ ఫోన్‌లు చూసుకుంటూ కాలక్షేపం చేయడంపై పలువురు చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు .

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

అపార్ట్‌మెంట్లు, ప్రధాన కూడళ్లు, పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణ, గ్యాస్ లీక్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ ముద్రించిన ప్రమాదాల నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ఇందిరానగర్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది



కొత్తూరు: మహసింగిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పొందూరు: పెట్రోల్ బంక్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

95 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జానకిరామయ్య

కొత్తూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర శిబిరాన్ని స్థానిక సీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, భామిని, సీతంపేట మండలాలకు చెందిన 95 మందికి నేత్ర పరీక్షలు చేపట్టారు. 44 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు గుర్తించినట్లు జానకిరామయ్య తెలిపారు. ఆపరేషన్లను రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. 44 మందిని ప్రత్యేక వాహనం ద్వారా తరలించినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత నరసన్నపేట



ట్రోఫీతో ఫుట్‌బాల్ జట్టు

నరసన్నపేట: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శ్రీకాకుళంలో జరిగిన సీనియర్ మెన్–7ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా నరసన్నపేట నిలిచింది. జిల్లా నుంచి 10 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ శ్రీకాకుళం, నరసన్నపేట మధ్య జరిగింది. నరసన్నపేట 2–0 గోల్స్ తేడాతో శ్రీకాకుళంపై విజయం సాధించింది. విజేతలకు నరసన్నపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్, కోచ్ అనిల్ అభినందించారు.

గోవులు తరలిస్తున్న వాహనాలు సీజ్



పోలీసులు పట్టుకున్న వాహనాలు

సరుబుజ్జిలి: కొత్తూరు మండలంలోని బలద సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు అక్రమంగా గోవులు తరలిస్తున్న వ్యాన్‌ను బుధవారం సరుబుజ్జిలి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. గోవులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 9 గోవులను విజయనగం జిల్లా గుర్ల మండలం గుజ్జంగివలసలో ఉన్న గోశాలకు తరలించినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో చేరండి



నరసన్నపేట: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు



ఆమదాలవలస: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చౌదరి రవీంద్ర, ఉపాధ్యాయులు



సారవకోట: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



హిరమండలం: అవలంగిలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం.. విద్యా రంగాన్ని బలోపేతం చేద్దామని, దీనికి అందరూ సహకరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి కోరారు. నరసన్నపేటలో బుధవారం యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ ప్రతినిధులు కోరాడ వైకుంఠరావు, దమయంతి, టి.శ్రీధర్ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం

ఆమదాలవలస: ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చౌదరి రవీంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని గేటు మున్సిపల్ హైస్కూల్‌లో యూటీఎఫ్ సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి టి.వి.టి.భాస్కరావు, కార్యవర్గ సభ్యులు కింతలి చందరరావు, చింతాడ వెంకట సత్యనారాయణ మూర్తి, పంచాది రవికుమార్, పెంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

సారవకోట: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓ ఎం.వి.రమణ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న వసతులు, విద్యా విధానం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అడ్మిషన్ డ్రైవ్..

హిరమండలం: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హిరమండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో బుధవారం ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. అవలంగిలో ఉపాధి పథకం చేపడుతున్న పనులు వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి వేతనదారులకు అవగాహన కల్పించారు. సీఆర్‌ఎంటీ ధనంజయరావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

నరసన్నపేట: పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన ఉచిత సేవల్లో యజమానులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. స్థానిక ఇండియన్ పెట్రోల్ బంకును బుధవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ నాణ్యత, కొలతలను పరిశీలించారు. ఇవి సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వినియోగదారులకు కల్పించాల్సిన సేవలు అందుబాటులో లేవన్నారు. నిబంధనల మేరకు అన్ని సదుపాయాలూ కల్పించాలని సూచించినట్లు ఆర్డీఓ తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటాన్ని గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. విధిగా మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. నరసన్నపేట డీటీ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

గోగు సాగు పెరగాలి



రైతులకు బుక్‌లెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

జలుమూరు: ప్లాస్టిక్ వినియోగం తగ్గాలంటే గోగు సాగుతోపాటు సహజ నారలు అందుబాటులోకి రావాలని, వీటి దిగుబడికి యాజమాన్య పద్ధతులు పాటించాలని గోగు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. యలమంచిలి గ్రామంలో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గోగు పరిశోధనా సంస్థ సంయుక్తంగా గోగు సాగుపై బుధవారం అవగాహన కల్పించాయి. గోగు పంట సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందని చిట్టిబాబు అన్నారు. జ్యూట్ కార్పొరేషన్ మేనేజర్ అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వం గోగుకు మద్దతు ధర పెంచిందని, గోగు సాగు చేస్తే ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు నేరుగా ప్రభుత్వమే గోగు విత్తనాలు అందించి నార కూడా కొనుగోలు చేస్తుందన్నారు. గోగు సాగులో మెలకువలు తెలిపే బుక్‌లెట్లను రైతులుకు అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.సురేష్, సిబ్బంది నవ్య, రైతులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



పాతపట్నం: రేగేటి షణ్ముఖరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: మండల కేంద్రం పరిధిలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. పాతపట్నంలోని జోగీశ్వరవీధికి చెందిన రేగేటి షణ్ముఖరావు తండ్రి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. షణ్ముఖరావు కుటుంబాన్ని రెడ్డి శాంతి పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. యశోధనగర్‌కు చెందిన టైలర్ నల్ల సూర్యారావు ఇటీవల మృతి చెందారు. మృతుడు కుమారుడు ప్రదీప్‌ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, పార్టీ నాయకులు పసుకు మోహన్, గోకవలస రాము, వంశీ, కుప్పిలి జానకమ్మ, ఫల్గుణరావు, ఎం.వరద రాజులు, తదితరులు ఉన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర కాలనీకి చెందిన ఉప సర్పంచ్ అగతమూడి సరస్వతి భర్త అప్పీస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుటంతో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. కుంటిభద్రకు చెందిన గులివిందల పోలినాయుడు అనారోగ్యంతో బాధపడటంతో పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యులు వనుము లక్ష్మీనారాయణ, అగతమూడి సుశీల, పార్టీ నాయకులు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, అగతమూడి నాగేశ్వరరావు, శంకరరావు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. పోలాకి ఎంపీపీ ముద్దాడ దమయంతిబైరాగినాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేసవి తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తీరప్రాంత గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు సైతం వెనకడుగు వేయవద్దన్నారు. చీడివలస పంచాయతీలో ఇటుక బట్టీల యజమాని తాగునీటి చౌర్యంపై సర్పంచ్ ముద్దాడ రాము సభ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే చర్యలు తీసుకోవాలి ఎంపీడీఓ రవికుమార్ సూచించారు. ఉపాధి పథకంలో మేట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో స్థానికంగా రాజకీయాలు చేసి వేతనదారులను ఇబ్బంది పెట్టే ఆలోచనను మానుకోవాలని వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు కోరారు. పోలాకి మండల కేంద్రంలోని సమస్యలను సర్పంచ్ మజ్జి రమణమ్మ సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో సన్న ధాన్యం కనీసమద్దతు ధరకు కూడా కొనుగోలు చేయటం లేదని కొందరు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువాచ్చరు. ఎక్స్‌పోర్ట్ నిలిచిపోవటంతోపాటు, క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ బుకింగ్ సమయంలో రైతుల వద్ద నుంచి సరైన సమాచారం ఇవ్వకపోవటంతో సన్నరకం ధాన్యం నమోదు కాలేదని, మండలంలో దాదాపు 700 టన్నుల వరకు సన్న ధాన్యం ఉన్నట్లు అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, తహసీల్దార్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.